సాక్షి నారాయణపేట


మంగళవారం ౹ 28 ౹ నవంబర్ ౹ 2023



పేటలో ఐటీ దాడులు

పేటలో అధికార పార్టీ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారుల దాడులు కలకలం రేపాయి.

వివరాలు 6లో ▸



కొల్లాపూర్.. ప్రగతి జోరు

ఒకప్పుడు వెనకబడిన కొల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.

వివరాలు 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /22.7

ఉదయం, సాయంత్రం చలిగాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మద్దూరుకు మంత్రి హరీశ్‌రావు

మద్దూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, గనుల శాఖ మంత్రి మహేందర్ రెడ్డి మద్దూరుకు రానున్నారు. మధ్యాహ్నం 12గంటలకు కొత్తబస్టాండ్ మీదుగా ర్యాలీ, పాతబస్టాండ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈమేరకు మద్దూరు శివారులోని సంగం చెరువు దగ్గర హెలిప్యాడ్ పనులను ఎన్నికల ప్రచార ఇంచార్జీ శ్రీహరి యాదవ్, బాల్‌సింగ్‌నాయక్, వెంకటయ్య, మహేందర్, నర్సింహా, రాజు, తదితరులు పరిశీలించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి



నారాయణపేట రూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారిపై అయినా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 553 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 90చోట్ల అతి సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బందోబస్తు కోసం ఆరు కేంద్ర సాయుధ బలగాల కంపెనీలు, ఇతర రాష్ట్రాల నుంచి 675 ఫోర్స్, జిల్లాలోని 540మంది పోలీసులు, రెండు టీఎస్ఎస్‌పీ ప్లటూన్స్‌తో మొత్తం 1950మందితో గట్టి భద్రత ఏర్పాట్లు చేపట్టామన్నారు. పోలింగ్ బూత్‌లను 61 రూట్లుగా విభజించి ఆయా విభాగల పర్యవేక్షణను సీనియర్ అధికారులకు అప్పగించామని, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు పెట్రోలింగ్ చేస్తారన్నారు. మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు డ్రై డేగా ప్రకటించబడిందని, ఈ సమయంలో ప్రచారం చేయడం, బల్క్ మెసేజ్‌లు పంపడం, ఓటర్లు కానివారు నియోజకవర్గంలో ఉండరాదన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినట్లు ఆదారాలు లభిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ ముమ్మరం..

వాహనాల రాకపోకలు, పార్టీ నాయకుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు ఆదారాలు లేకుండా తరలిస్తున్న రూ.2.98కోట్ల నగదు, 2900లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని గ్రివియస్ కమిటీకి అందించినట్లు తెలిపారు. దాదాపు వాటిలో చాలా వరకు ఎన్నికలకు సంబంధించినవి కాకపోవడంతో ఆధారాలు చూయించిన వారికి తిరిగి చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయానికి లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరికైన ఇబ్బందులు, బెదిరింపులు వస్తే డయల్ 100కు, దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు.

పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల రిత్యా అధికారులు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ఏమైనా సమస్యలు ఉంటే వీలైనంత త్వరగా పరిష్కరించి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, పంచాయతీరాజ్ ఏఈఈ విలోక్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీదేవి, కృష్ణ, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.





కోస్గిలో సభకు హాజరైన జనం

కేసీఆర్ పని దోచుకోవడం.. దాచుకోవడమే

కోస్గి, గద్వాల బహిరంగసభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

- ప్రాణాల విలువ తెలిసే సోనియా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- దేశం కోసం మా నానమ్మ ఇందిరమ్మ, నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలు కోల్పోయారు
- రాష్ట్రంలో ప్రజలు పేదలుగానే ఉన్నారు.. కేసీఆర్ కుటుంబం మాత్రం రూ.కోట్లకు పగడలెత్తింది
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. మాఫియారాజ్యాన్ని తరిమికొడతాం

కోస్గి/గద్వాల రూరల్: 'ఆనాడు దేశం కోసం మా నానమ్మ ఇందిరమ్మ.. నాన్న రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు.. ప్రత్యేక రాష్టం కోసం ఎందరో యువకులు, ప్రజలు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.. ఆ కుటుంబాల బాధ, మనిషి ప్రాణం విలువ తెలిసిన వ్యక్తిగా తన తల్లి సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది.. కానీ, ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ దోచుకోవడం, దాచుకోవడమే చేశార'ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కోస్గి, గద్వాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడితే రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారని ఆశించి.. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్, అతని కుటుంబమే బాగుపడి రూ.లక్షల కోట్లు దోచుకొని విలాసవంతమైన జీవితం గడుతున్నారని, పేదలు మాత్రం మరింత పేదలుగా మారారని దుయ్యబట్టారు. మొదటిసారి రేవంత్‌రెడ్డి నన్ను కలిసినప్పుడు ఎలాంటి పదవి అడగలేదని, గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజల కోసం తాను చేస్తున్న పోరాటం వివరించి.. రాష్ట్రంలో మార్పు కోసం, ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం మాత్రమే ఇవ్వాలని కోరారన్నారు. రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలపై ప్రేమాభిమానాలు ఉన్నాయని, ప్రజలకు సైతం రేవంత్ అంటే ఎంతో ప్రేమ ఉందనే విషయం తమకు తెలుసు అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, ఉపాధి అవకాశాలు లేక యువత ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసే పనిని మాత్రమే చెబుతుందని, ఇందుకు నిదర్శనమే కర్ణాటకలో అమలు చేస్తున్న హామీలు అని పేర్కొన్నారు. రాజస్తాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సైతం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసి అన్నివర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. తెలంగాణలో సైతం అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి జిల్లాకు ఒక ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభిస్తామన్నారు. దేశంలో సచివాలయానికి రాకుండా పదేళ్లు పాలించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

వందశాతం అమలు చేస్తాం..

కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉన్నాయని, వాటిని కూడా వందశాతం పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రియాంకాగాంధీ చెప్పారు. ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంట్లో అర్హులైన ఇద్దరు వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున పింఛన్ పథకాలు అమలు చేస్తామన్నారు. గద్వాలలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చేనేత పార్కు ఏర్పాటు చేసి చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. కోస్గి సభలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, పరిగి, తాండూరు అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్‌కుమార్, యూసుబ్, పార్టీ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాయకులు కిష్టప్ప, నరేందర్, హరి, భీంరెడ్డి, రాఘవరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి సభ సైడ్‌లైట్స్

- ప్రియాంకగాంధీ 4 గంటలకు సభావేదికపైకి చేరుకున్నారు.
- మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని స్వయంగా రేవంత్‌రెడ్డి ప్రియాంకగాంధీకి పరిచయం చేస్తూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారని, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అని తెలిపారు.
- ప్రియాంకగాంధీ ఏకధాటిగా 47 నిమిషాల పాటు ప్రసంగించారు.
- ముందుగా జైబోలో తెలంగాణ, మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామికి జై, రేణుక ఎల్లమ్మజీకి జై అంటూ ప్రజలచేత జేజేలు పలికించారు.
- ప్రియాంకగాంధీ రేవంత్‌రెడ్డి పేరు చెప్పగానే పెద్దఎత్తున అరుపులు, కేకలతో ప్రజలు నినాదాలు చేశారు.
- 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అంటూ సభకు వచ్చిన జనంతో ప్రియాంకగాంధీ అనిపించారు.
- సభ ముగియగానే రేవంత్‌రెడ్డి పేరుతో వచ్చిన డీజే పాటకు జనం కేరింతలతో డ్యాన్స్ చేశారు. దీంతో వేదికపై ఉన్న ప్రియాంక సైతం చప్పట్లు కొడుతూ సభికులను ఉత్సాహపరిచారు.

జంగ్ తెలంగాణ



కోస్గి సభలో అభివాదం చేస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ.. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే

రాష్ట్రంలో మాఫియాల రాజ్యం

రాష్ట్రంలో ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ఎన్నో చట్ట విరుద్ధ పనులతో దొరల పాలన సాగుతుందని విమర్శించారు. దోచుకున్న డబ్బుతో విచ్చలవిడిగా ఖర్చు చేసి అధికారంలోకి వస్తామన్న ధీమాలో కేసీఆర్ ఉన్నారని, మా నానమ్మ ఇందిరమ్మ చెప్పిన విషయం బాగా గుర్తుందని, ప్రజాస్వామ్యంలో ప్రజలే శక్తివంతులని, ప్రజలు అనుకుంటే ఏ శక్తి తట్టుకోలేదని, ఇదే నమ్మకంతో మీ ముందుకు వస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డితోపాటు నేను కూడా వేదికపై నిలబడి ఉన్నామని, మాకు ఇతర ధర్మాలు లేవని, సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వస్తున్నామని, ప్రజలు జాగృతమై అన్ని విధాలుగా ఆలోచించి పనిచేయని వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్, వైన్ మాఫియాల భరతం పడతామన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి పాటకు చప్పట్లతో ప్రజలను ఉత్తేజపరిచారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

- రాజకీయాల్లోకి అందుకే వచ్చా..
- 'పాలమూరు – రంగారెడ్డి' నీటితో రైతుల పాదాలు కడుగుతా
- మూడు మండలాల ఏర్పాటుకు కృషి
- నారాయణపేటను ఎంతో అభివృద్ధి చేశా.. చేస్తా
- ప్రజాదరణతో హ్యాట్రిక్ సాధిస్తా
- 'సాక్షి'తో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

INTERVIEW



'సాక్షి'తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: 'నియోజకవర్గంలో ప్రతి ఎకరాకి సాగునీరు అందించడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చా.. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నారాయణపేట జాయమ్మ చెరువుకు సాగునీరు తీసుకువచ్చి రైతుల పాదాలు కడుగుతా.. నియోజకవర్గ ప్రజల డిమాండ్ మేరకు నారాయణపేట, దామరగిద్ద, కోయిలకొండ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు మండలాల ఏర్పాటుకు కృషిచేస్తా.. బీఆర్ఎస్ నూతన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాం.. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది.. హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ కావడం ఖాయం.. ప్రజలు తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపేందుకు సిద్ధంగా ఉన్నారు..' అని నారాయణపేట బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

రూ.554.39 కోట్ల పనులు పురోగతిలో..

జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలో రూ.554.39 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.56 కోట్లతో జిల్లా ఆస్పత్రి, రూ.55 కోట్లతో నూతన కలెక్టరేట్, రూ.8.65 కోట్లు కలెక్టర్ క్వార్టర్స్, రూ.38.60 కోట్లతో ఎస్పీ కార్యాలయం, రూ.3 కోట్లతో నారాయణపేట రూరల్ పోలీస్‌స్టేషన్, రూ.7 కోట్లతో మరికల్ మండల కాంప్లెక్స్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రూ.30 కోట్లతో కోయిల్‌సాగర్ లెఫ్టుకెనాల్ లైనింగ్ పనులు, రూ.68.02 కోట్లతో చెక్‌డ్యాంల నిర్మాణం, మెడికల్ కళాశాలకు రూ.180 కోట్లు, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు రూ.4.50కోట్లు మంజూరు చేశాం. ఈ అభివృద్ధి పనులన్నీ మరో ఏడాదిలోపు పూర్తి అయి వినియోగంలోకి రానున్నాయి. అభివృద్ధిని ఆకాంక్షిస్తూ జనమంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మరో ఆరు రోజుల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఇందులో ఎలాంటి సందేహం లేదు..' అని సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు.

రూపురేఖలు మార్చా..

ప్రత్యేక రాష్ట్రం రాక ముందు నారాయణపేట ఎట్లా ఉండే.. తెలంగాణ వచ్చిన తర్వాత బంగారు తెలంగాణ దిశగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో పదేళ్లుగా నారాయణపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేశా. ఆలయాలు, దర్గా–ఈద్గాల అభివృద్ధికి దాదాపు రూ.2వేల కోట్లు, 1200మందికి దళితబంధు కింద రూ.120కోట్లు, 97,278,58 మందికి ఉచితంగా కంటి పరీక్షలు, 24,908మందికి కేసీఆర్ కిట్లు, ఆరు దశాబ్దాల కల అయిన రోడ్డు విస్తరణను రూ.28.50కోట్లతో చేశాం. మిషన్‌కాకతీయ పథకం కింద రూ.52కోట్లతో 315 చెరువులు మరమ్మతు, పూడిక తీసి 13,705 ఎకరాలు సాగులోకి వచ్చేలా చేశాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ.లక్ష చొప్పున 10,885 మందికి సాయం, రూ.138.29 కోట్ల వ్యయంతో మంచినీటి పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించి 99 శాతం ఇళ్లకు మంచినీటి కనెక్షన్లు ఇచ్చాం. ఇవేగాక రూ.2 కోట్లతో ఎకో పార్కు, రూ.100 కోట్లతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు, రూ.8 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.1.35 కోట్లతో మటన్, చికెన్ ఫిష్ మార్కెట్లు, రైతు బంధు కింద 72,105 మంది రైతులకు రూ.682.71 కోట్లు అందించాం.

⇨ విద్యా రంగానికి పెద్దపీట వేశాం. నూతన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, రూ.180 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశాం. నర్సింగ్ కళాశాలలను మంజూరు చేయించాం. ధన్వాడ, కోయిల్‌కొండ, దామరగ్ది, నారాయనేట జూనియర్ కళాశాలలకు ఒక్కో దానికి రూ. 2.25 కోట్లు, కోయిలకొండ కేజీబీవీకి రూ.2.25 కోట్లు, గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు, మౌళిక సదుపాయాలకు రూ.12.13 కోట్లతో 61 పనులు చేశాం. నియోజకవర్గంలో 45 తండాలను గ్రామ నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. జిల్లా కేంద్రంలో సంత్‌సేవాలాల్ బంజరా భవన్ నిర్మాణానికి 1000 గజాల స్థలంలో పాటు రూ.కోటి నిధులు మంజూరీ చేశాం. కోయిలకొండ మండల కేంద్రంలో సంత్‌సేవాలాల్ భవన్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు విలువ చేసే వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించడం జరిగింది.

బీచుపల్లిలో వైభవంగా సామూహిక వ్రతాలు



ఎర్రవల్లిచౌరస్తా: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం ఉపవాసంతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామస్వామి ఆలయ ప్రధాన అర్చకులు దత్తుస్వామి, భువనచంద్రాచార్యులు వేదమంత్రాల నడుమ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, భక్తులకు గద్వాలకు చెందిన రిటైర్డ్ టీచర్ రామ తులశమ్మ కుటుంబ సభ్యులు అల్పాహారం, అన్నదానం చేసినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు తెలిపారు. అదేవిధంగా, శివాలయం, కోదండరామస్వామి ఆలయంతో పాటు అభయాంజనేయ స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కృష్ణానది వద్ద దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా మహిళల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక



క్రీడాకారులతో కబడ్డీ యూనియన్ నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లా మహిళల సీనియర్ కబడ్డీ జట్టును ఎంపిక చేయడం జరిగిందని కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా బుసపూర్‌లో డిసెంబర్ 4 నుంచి 6 వరకు జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ టోర్నీకి జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని తెలిపారు. క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబర్చాలని ఆయనతోపాటు పలువురు ఆకంక్షించారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈవీఎంల తరలింపునకు కట్టుదిట్టమైన భద్రత
- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తప్పక పాటించాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష వివరించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా ఆ సందేశం స్పష్టంగా తెలియజేసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలన్నారు.

కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్..

పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్ , రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టండగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలన్నారు. పోలింగ్ అనంతరం పీఎస్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూంకు ఈవీఎంల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్‌రోజు సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మాక్‌పోల్ నిర్వహించాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ , ఆర్డీఓ రాంచందర్, ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

రిసెప్షన్ కేంద్రం తనిఖీ

సాధారణ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం నారాయణపేటలోని శ్రీదత్త బృందావన్ బీఈడీ కళాశాలలో రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అవసరమైన టెబుల్స్, చైర్స్, టెంట్స్, బారికెడ్స్, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఏఓ నర్సింగ్‌రావు, సర్వేయర్ మల్లేశ్ ఉన్నారు.

బల్క్ ఎస్ఎంఎస్ ప్రసారాలను పర్యవేక్షించాలి

బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రసారాలను నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు జిల్లా ఎన్నికల అధికార, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో సూచించారు. 48 గంటల లైసెన్స్ పిరియడ్‌లో ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లను ప్రసారం చేయడం నిషేధమని, 28 సాయంత్రం 5 గంటల నుంచి 30 న సాయంత్రం 5 గంటలకు వరకు నిశ్శబ్ద, వ్యవధి (సైలెన్స్ పిరియడ్)లో అభ్యంతకరమైన, రాజకీయ పరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రసారం నిషేధించినట్లు తెలిపారు. ఒక వేళ పంపితే.. అందుకు అయ్యే ఖర్చులను ఎన్నికల ఖర్చుగా పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు రిటైర్మెంట్ ఇవ్వాలి

కేసీఆర్ అవినీతిని ఎండగట్టి ప్రజల ముందు నిలబెడతాం

- బంగారు తెలంగాణకు బదులు అప్పుల కుప్పగా మార్చారు
- రాష్ట్రంలో రామరాజ్య స్థాపనకు కలిసిరావాలి
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న రాజాసింగ్

పాలమూరు/అమరచింత: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఇంటికి పంపించి రిటైర్మెంట్ ఇవ్వాలని బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి జిల్లా అమరచింతలో బీజేపీ అభ్యర్థులు ఏపీ మిథున్‌రెడ్డి, జలంధర్‌రెడ్డిలకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పదేళ్లకాలంలో బంగారు తెలంగాణ బదులు అప్పుల తెలంగాణగా మార్చారని, మన కడుపులో ఉన్న బిడ్డ మీద కూడా రూ.1.25 లక్షల అప్పు పెట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్షల కోట్లు కమీషన్ల రూపంలో దండుకున్నారని, కానీ, ప్రాజెక్టు మాత్రం నీట మునిగిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడితే కవిత లిక్కర్ దందాలో జైలుకు వెళ్లనుందన్నారు. నిరుద్యోగులు బలిదానంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం పదవులను దక్కించుకొని సంపాదనే ధ్యేయంగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నిత్యం మద్యం మత్తులో ఊగిసలాడే సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తానే నడిపించానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యం మత్తులో ఇంట్లో పడుకోవడంతోనే సమయాన్ని గడిపాడని, ఎందరో మేధావులు తమ శక్తిమేరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తే కేసీఆర్ అదంతా తన క్రెడిట్ అని చెప్పుకొని అధికారం దక్కించుకున్నాడన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఒక్కటే..

రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేయడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తెరవెనుక ఒప్పందంతో ఎన్నికల బరిలో నిలిచాయని రాజాసింగ్ ఆరోపించారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశానికి కాంగ్రెస్ పార్టీ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తీవ్రవాదం పెరిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే పరోక్ష కారణమన్నారు. దేశంలో హిందు రాజ్య స్థాపనను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ ఎమ్మెల్యే అభ్యర్థి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఖతం కాబోతున్నాయని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పాలమూరు మరో పాతబస్తీ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ రాష్ట్రం పూర్తిగా అప్పుల పాలైందని, ఇక్కడ ఇచ్చిన గ్యారంటీలకు కూడా ఏమాత్రం గ్యారంటీ లేదన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇల్లు బాగుపడుతుందన్నారు. ఆయా సభల్లో కర్ణాటక కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ నేతలు కొండయ్య, కృష్ణానాయక్, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, యాదయ్య, బుచ్చిరెడ్డి, వేణమ్మ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

తెలంగాణలో బుల్డోజర్ బాధ్యత తీసుకుంటా

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి..బీసీ ముఖ్యమంత్రి అయిన తర్వాత తాను బుల్డోజర్ బాధ్యత తీసుకుని బీఆర్‌ఎస్ పాలకులు చేసిన అవినీతి, భూ కబ్జాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఎంఐఎం చేతుల్లో కారు స్టీరింగ్ పెట్టారని, ఈ ఎన్నికల్లో ప్రజలు కారుకు ఓటు వేస్తే పాతబస్తీ నేతల చేతుల్లో పాలన ఉంటుందన్నారు. మత విద్వేశాలను రగిల్చి రాష్ట్రంలో హిందు ముస్లింల మధ్య అల్లర్లను సృష్టించి పబ్బం గడుపుకొనేందుకే ఓవైసీ సోదరులు రాజకీయ ముసుగు కప్పుకున్నారని ఆరోపించారు.


అమరచింతలో రాజాసింగ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

బీసీని సీఎం చేస్తాం..

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ ఈ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశాడని, కానీ నరేంద్రమోదీ చెప్పిన మాటకు కట్టుబడి బీసీని ముఖ్యమంత్రి చేస్తారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని డిక్లేర్ చేసిన తర్వాత కేసీఆర్ కింద మంట మండుతుందన్నారు. పాలమూరులో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి బంగారు పాలమూరుగా అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడానికి ప్రతి కార్యకర్త టెక్నాలజీతో యుద్ధం చేసి పాలమూరులో మిథున్‌రెడ్డిని, మక్తల్‌లో జలంధర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.

ఎన్నికల సిత్రాలు..

దండాలమ్మ..


చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లో దేవరకద్ర బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. - దేవరకద్ర

బస్తాలు మోస్తాం.. ఓట్లు రాబడతాం..


పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి తరఫున స్థానిక నాయకులు వినూత్నంగా ప్రచారం నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. - పాన్‌గల్

కాగడాల వెలుగులో..


నాగర్‌కర్నూల్ సెగ్మెంట్‌లోని తెలకపల్లి మండలం తాళ్లపల్లిలో ఎన్నికల ప్రచారానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వెళ్లగా.. గ్రామస్తులు కాగడాలతో ఘనస్వాగతం పలికారు. - తెలకపల్లి

చిన్నారితో సరదాగా..


చిన్నచింతకుంట మండలం గూడూర్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టిన కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి ఓ చిన్నారిని ఎత్తుకొని లాలించడం అందరినీ ఆకట్టుకుంది. - చిన్నచింతకుంట

కారు బోల్తా: ఒకరి మృతి

అడ్డాకుల: కర్నూల్ జిల్లాకు చెందిన రామయ్య(80) తన సోదరుడు, మరో డ్రైవర్‌తో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. శాఖాపూర్ దాటిన తర్వాత పాత రోడ్డు సమీపంలో కారుకు అడ్డుగా కుక్క వచ్చింది. దీంతో దాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ కారును పక్కకు తిప్పగా.. కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. అందులోని రామయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. రామయ్యను ఎల్ అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందారని అక్కడి వైద్యులు చెప్పినట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో రైతు..

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని మనికొండలో పెండెం చంద్రశేఖర్(49) విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు ఆదివారం ఉదయం తన ఇంట్లో స్విచ్ బోర్డు వద్ద ఆన్‌ఆఫ్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు సర్పంచ్ గంగాపురి తెలియజేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకొని పేద కుటుంబానికి అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం దుకాణం సీజ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని న్యూబాలాజీ మద్యం దుకాణాన్ని ఆదివారం రాత్రి ఎన్నికల వ్యయ పరిశీలకుడు, ఐఆర్‌ఎస్ అధికారి కుందన్‌యాదవ్ తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎక్కువ మొత్తంలో మద్యం విక్రయించినట్లు గుర్తించారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఈఎస్ సైదులు, సీఐ వీరారెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్ మద్యం దుకాణంలో స్టాక్ పరిశీలించి సీజ్ చేశారు. సదరు దుకాణదారుడి లైసెన్స్ రద్దు చేశారు. దుకాణంలో రూ.8లక్షల విలువగల స్టాక్ ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా రెండు రోజుల కిందట జహంగీర్ అనే వ్యక్తి రూ.2లక్షల విలువగల మద్యాన్ని ఆటోలో తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

భారీగా మద్యం పట్టివేత

చిన్నంబావి: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని దగడపల్లిలో రూ.4లక్షల విలువగల 47 కాటన్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు. దగడపల్లికి చెందిన వెంకట్రావు ఇంట్లో 29 కాటన్లు, కుమ్మరి రమేష్ ఇంట్లో 3 కాటన్లు, కుమ్మరి శంకరయ్య ఇంట్లో 17 కాటన్ల మద్యం నిల్వ చేయగా, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ కళ్యాణ్, స్పెషల్ పార్టీ పోలీస్ రవినాయక్, వీపనగండ్ల ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.

కొల్లాపూర్.. ప్రగతి జోరు

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- 167కే జాతీయ రహదారి, ఐకానిక్ బ్రిడ్జితో ప్రత్యేక గుర్తింపు
- సాగు, తాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర బిందువు
- బీడు భూములు సస్యశ్యామలం

గ్రాండ్ రిపోర్ట్

కొల్లాపూర్: ఒకప్పుడు వెనుకబాటుతనానికి కేరాఫ్‌గా చెబుకునే కొల్లాపూర్ నియోజకవర్గం.. ఇప్పుడు అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. తాగు, సాగు నీటి ప్రాజెక్టులకు కేంద్ర బింధువుగా మారింది. లక్షన్నర ఎకరాల మేరకు వ్యవసాయ భూములకు సాగునీరు సమృద్ధిగా అందుతోంది. మారుమూల ప్రాంతంగా పేరుపడ్డ కొల్లాపూర్‌కు 167కే జాతీయ రహదారి నిర్మాణంతో ఆ పేరు చెరిగిపోనుంది. సోమశిల సమీపంలోని కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే కొల్లాపూర్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కనుంది. జాతీయ రహదారి, బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయితే పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా మారనుంది.

కొల్లాపూర్ మున్సిపాలిటీలో..

కొల్లాపూర్‌కు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కాగా.. తరగతులు ప్రారంభమయ్యాయి. కొత్తగా మరో పాల్‌టెక్నిక్ కళాశాల మంజూరైంది. మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో దళితవాడల అభివృద్ధి. అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో వార్డుల్లో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. 4వ వార్డులో నిర్మించిన అర్బన్ పార్కు అందరినీ ఆకర్షిస్తోంది. మిషన్ భగీరథ ద్వారా 90శాతం నివాసగృహాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది. ప్రధాన కూడళ్లలో ఆర్‌అండ్‌బీ సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటు, ఈదమ్మ గుడి, ఖాదర్‌పాషా దర్గా అభివృద్ధి వంటి పనులు చేపట్టారు. బీసీ, ఎస్సీల శ్మశానవాటిక కోసం 3 ఎకరాల స్థలం కేటాయించారు. చుక్కాయిపల్లిలో రూ.5.25కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేశారు.

పెంట్లవెల్లిలో..

రూ.9.65కోట్లతో మల్లేశ్వరం–పెంట్లవెల్లి మధ్యనున్న వాగుపై బ్రిడ్జి నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. పెంట్లవెల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, చౌటచెరువుపై నమాజ్‌కట్ట విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రూ.9కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు రూ.1.50కోట్లతో పంచాయతీ భవనాలు, రూ.3.50కోట్లతో పాఠశాలల్లో మౌలికల సదుపాయాల కల్పించారు. గోప్లాపూర్, కొండూరు గ్రామాల్లో రూ.6.60కోట్లతో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. మల్లేశ్వరం, వేంకల్ ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం రూ.33కోట్లు మంజూరు చేసింది.

పాన్‌గల్‌లో...

పాన్‌గల్‌లో ప్రధాన రహదారి విస్తరించడంతో పాటు తెల్లరాళ్లపల్లి, రాయినిపల్లి గ్రామాల సమీపంలోని వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించారు. కొత్తపేట, పాన్‌గల్‌లో గోదాంల నిర్మాణాలు పూర్తయ్యాయి. కేతేపల్లి సమీపంలో మినీ బ్రిడ్జి నిర్మాణం తుది దశలో ఉంది. కిష్టాపూర్ సమీపంలో రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులను కేటాయించారు. పాన్‌గల్‌లో ఏడీఏ కార్యాలయం ఏర్పాటుతో పాటు మండల కాంప్లెక్స్ నిర్మించారు.


పాన్‌గల్ మండలం రాయినిపల్లి సమీపంలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం

చిన్నంబావిలో..

రూ.6,50కోట్లతో చేపట్టిన చిన్నమారూరు లిఫ్టు ఇరిగేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేయగా.. కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉంది. మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ఏర్పాటు చేశారు. చిన్నదగడ, బెక్కెం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు.

వీపనగండ్లలో....

వీపనగండ్ల నుంచి గోవర్ధనగిరి వరకు రూ.8కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టారు. రూ.5కోట్లతో తూము కుంట సమీపంలోని వాగుపై వంతెన నిర్మించారు. రూ.7కోట్లతో సంగినేనిపల్లి నుంచి పుల్గర్‌చర్ల వరకు రోడ్డు, వల్లభాపురం సమీపంలో రూ.3కోట్లతో వాగుపై చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టారు. మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

పెద్దకొత్తపల్లిలో..

వేడుకరావుపల్లి తండా సమీపంలోని వాగుపై రూ.3కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. పెద్దకొత్తపల్లిలో రూ.1.50 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణంతో పాటు దేవల్ తిర్మలాపూర్ నుంచి నాయినోనిపల్లి మైసమ్మ వరకు బీటీరోడ్డు పనులు చేపట్టారు. రూ.3కోట్లతో మైసమ్మ ఆలయం నిర్మించారు. పెద్దకొత్తపల్లికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కాగా.. తరగతులు ప్రారంభమయ్యాయి. బాచారం హైలెవల్ కెనాల్, పసుపుల బ్రాంచ్ కెనాల్ పనులకు ప్రభుత్వం రూ.55కోట్ల మేరకు మంజూరు చేసింది.

కోడేరులో..

నర్సాయిపల్లి నుంచి తీగలపల్లి వరకు రూ.26 కోట్లతో బీటీరోడ్డు విస్తరణ చేపట్టారు. తీగలపల్లి–బావాయిపల్లి మధ్యనున్న వాగుపై రూ.80 లక్షలతో వంతెన నిర్మించారు. ఎత్తం సమీపంలోని మాలవాగుపై రూ.1.80 కోట్లతో బ్రిడ్జి నిర్మాణంతో పాటు రూ.56 కోట్లతో తీగలపల్లి నుంచి యాపట్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. కోడేరులో రూ.2.80 కోట్లతో, జనుంపల్లిలో రూ.1.50 కోట్లతో సీసీరోడ్లు నిర్మించారు. రూ.36కోట్లతో చెన్నారం నుంచి సింగోటం వరకు రోడ్డు నిర్మించారు. రూ.7కోట్లతో నాగులపల్లి నుంచి చిక్కేపల్లి తండావరకు, రూ.4కోట్లతో గుండె వాల్యానాయక్ తండా నుంచి మొండి తండా వరకు, రూ.4కోట్లతో కోడేరు నుంచి నాగులపల్లి వరకు బీటీరోడ్ల పనులు చేపడుతున్నారు. రూ.10కోట్లతో కోడేరు నుంచి పెద్దకొత్తపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.

అభివృద్ధి వేగవంతమైంది..


కొల్లాపూర్‌లోని దళితవాడల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలను పూర్తిస్థాయిలో నిర్మించారు. 4వ వార్డులో నిర్మించిన అర్బన్ పార్కు అద్భుతంగా ఉంది. మా వార్డు అభివృద్ధికి చిరునామాగా మారింది. అక్కడక్కడ చిన్నచిన్న పనులను పూర్తి చేయాలి.


– జామ్ వేణు, కొల్లాపూర్

వాగు వద్ద ఇబ్బందులు పడేవాళ్లం


మల్లేశ్వరం–పెంట్లవెల్లి గ్రామాల మధ్య ఉండే వాగును వర్షాకాలంలో దాటేందుకు వీలయ్యేది కాదు. మల్లేశ్వరం, వేంకల్, ఎంగంపల్లి గ్రామాల ప్రజలు పెంట్లవెల్లికి రావాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వాగుపై బ్రిడ్జి నిర్మించడం సంతోషంగా ఉంది. మల్లేశ్వరం, వేంకల్ ఎత్తిపోతల పథకాలతో సాగునీటి సమస్య తీరుతుంది.

– భోగ్యం రాంచందర్‌నాయుడు, మల్లేశ్వరం

కొల్లాపూర్ రూరల్‌లో..


ముక్కిడిగుండం సమీపంలోని ఉడుముల వాగు, చుక్కాయిపల్లి సమీపంలోని సాకలిమడుగు వాగుపై బ్రిడ్జిలు నిర్మించారు. నార్లాపూర్ పెద్దవాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని వినియోగంలోకి తెచ్చారు. రామాపురం శివారులో 50పడకల ఎంసీహెచ్, కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. వంద పడకల ఆస్పత్రి పనులు కొనసాగుతున్నాయి. సింగోటం ఆలయ పునర్నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరయ్యాయి. సింగోటంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. ఎల్లూరు రిజర్వాయర్‌కు తూము ఏర్పాటు చేయించారు. జీల్‌దార్‌తిప్ప చెరువుకు కేఎల్‌ఐ నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.32కోట్లు కేటాయించింది. ముక్కిడిగుండం, నార్లాపూర్ గ్రామాల మధ్య నున్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

అందరి అభ్యున్నతే మా లక్ష్యం

- కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి నారాయణస్వామి


ఉప్పునుంతలలో ప్రచారం నిర్వహిస్తున్న కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి

అచ్చంపేట/ఉప్పునుంతల: అందరి అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి నారాయణస్వామి అన్నారు. సోమవారం అచ్చంపేట, ఉప్పునుంతలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేయడంతో పాటు దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్లు గడుస్తుందని.. 65ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు. అభివృద్ధి చేసి ఉంటే ప్రస్తుతం గ్యారంటీలను చూపిస్తూ ప్రజల నుంచి ఓట్లను అభ్యర్థించే అవసరం ఉండేదికాదన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో ఎంతో అభివృద్ధి సాధించినట్లు వివరించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంతో 11కోట్ల కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. 18కోట్ల కుటుంబాలకు పీఎం ఆవాసయోజన ద్వారా ఇళ్లు కట్టించడంతో పాటు వంట గ్యాస్, తాగునీరు, ఇంటి స్థలాలు అందించినట్లు వివరించారు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు ప్రధాని మోదీ పరిష్కారం చూపించనున్నారని తెలిపారు. తెలంగాణలో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో సామాన్యులకు ఉన్నత పదవులు కట్టబెట్టి సముచిత స్థానం కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ బిడ్డను సీఎం చేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. అచ్చంపేట ప్రాంత అభివృద్ధి కోసం ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి, బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే డియోరావ్ హ్రాలి, బీజేపీ అభ్యర్థి సతీష్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, మంగ్యానాయక్, ధర్మానాయక్, రేణయ్య, సైదులు, శ్రీనునాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీంమాదిగ పాల్గొన్నారు.

1977లో ఇందిరాగాంధీ ప్రచారం


1977 ఎన్నికల్లో మక్తల్ సెగ్మెంట్ నుంచి ఇందిరా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నర్సింహులు నాయుడు పోటీచేశారు. ఆయన తరఫున దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రచారం నిర్వహించారు. మక్తల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. హిందీలో ఆమె మాట్లాడగా.. రైల్వేశాఖ మాజీ సహాయమంత్రి మల్లికార్జున్ తెలుగులో అనువదించారు. అప్పటి ఎన్నికల్లో హేమాహేమీలపై నర్సింహులు నాయుడు విజయం సాధించి, మక్తల్ చరిత్రను తిరగరాశారు. – మక్తల్

కొల్లూర్‌లో కవ్వింపు చర్యలు

- పోటాపోటీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల నినాదాలు


కొల్లూర్‌లో పోటాపోటీగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కొల్లూర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారానికి స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకొని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని నినాదాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సైతం నినాదాలు చేయడంతో గ్రామం మొత్తం దద్దరిల్లింది. ఒక దశలో ఒకరినొకరు తోసుకుంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు పాల్పడే స్థాయికి అక్కడి పరిస్థితి చేరడంతో మండల నాయకులు కలుగజేసుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కాగా ఎలాంటి గొడవ జరగకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారం ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఐటీ దాడులతో కలకలం

14 గంటలు దాటిన కొనసాగిన తనిఖీలు

నారాయణపేట: ఎన్నికల వేళ నారాయణపేటలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులపై సోమవారం తెల్లవారుజాము నుంచి ఐటీ అధికారులు దాడులు చేపట్టడంతో పట్టణంలో కలకలం రేపినట్లయింది. మరో మూడు రోజుల్లో పోలింగ్ జరగనున్న సమయంలో నారాయణపేటలో ముగ్గురు బీఆర్‌ఎస్ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు చేయడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ దాడుల వెనక కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందా.. లేక బీఆర్‌ఎస్ కుట్ర చేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం జరుగుతుంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సంబంధించిన వ్యక్తులతో ముందు నుంచి ఆయనకు సత్సంబంధాలు ఉండటం.. అధికార పార్టీకి దగ్గర ఉంటూ.. కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరో వ్యాపారి కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ ఇచ్చి ఉంటాడనే నేపథ్యం.. రిటైర్డ్ ప్రిన్సిపల్ చిట్టెం కుటుంబానికి విశ్వాసపాత్రుడు కావడంతో ఈ దాడులు అధికార పార్టీ నుంచే ఎవరో ఒకరు ఐటీ శాఖకు ఫిర్యాదు చేసి ఉండవచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అసలు రహస్యం ఏమిటో..?

పేట నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య పోటీ నెలకొనేది. అయితే ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం సరైంది కాదని కొంతమంది యువకులు పార్టీని వీడి.. గ్రూపు తగాదాలతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీంతో బీజేపీనే ఒకవేళ ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చి బుక్ చేసి ఉండొచ్చు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ ఐటీ దాడుల వెనక అసలు రహస్యం ఏమిటనేది తెలియాల్సి ఉంది.